క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నారాయణపేట: నారాయణపేట మండలం అప్పక్‌పల్లిలో 132 కేవీ సబ్‌స్టేషన్‌కు మద్దూర్ 132 కేవీ నూతన లైన్ ఏర్పాటు చేస్తున్నందున బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సింగారం, కోటకొండ, చిన్నజట్రం, కొల్లంపల్లి, అప్పక్‌పల్లి, సబ్‌స్టేషన్లకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని నారాయణపేట రూరల్ ఏఈ సాయినాథ్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. రైతులు, వ్యాపారులు సహకరించాలని ఆయన కోరారు.

ప్రభుత్వ ఆస్పత్రిని పంచాయతీకి కేటాయించొద్దు

ధన్వాడ: మందిపల్లిలో పల్లె దవాఖానలో గ్రామ పంచాయతీ ఏర్పాటు చేయడం సరికాదని మాజీ ఉపసర్పంచ్ రామకృష్ణారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నూతన గ్రామ పంచాయతీ కార్యాలయం నిర్మాణం పూర్తి అవడానికి దగ్గర పడిందని, ఇప్పుడు ప్రభుత్వ పల్లె దవాఖానలో ఏర్పాటు చేయడం వల్ల రోగులకు ఇబ్బంది అవుతుందని పేర్కొన్నారు.

బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడిగా అంజయ్య

కోస్గి: బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడిగా మండలంలోని చంద్రవంచ గ్రామానికి చెందిన వార్ల అంజయ్యను ఎన్నుకున్నారు. పార్టీలో క్రియాశీలకంగా పని చేస్తున్న అంజయ్యను గుర్తించి జిల్లా కమిటీలో స్థానం కల్పించడంతో మండల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం కోస్గిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆ పార్టీ నాయకులు అంజయ్యను సన్మానించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పాలెం ప్రశాంత్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రతాప్‌రెడ్డి, అసెంబ్లీ కో కన్వీనర్ రాము, మండల మాజీ అధ్యక్షుడు సీబీ వెంకటేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్ష పదవికి నామినేషన్ దాఖలు

నారాయణపేట రూరల్/ఊట్కూర్: బీజేపీ జిల్లా అధ్యక్ష పదవికి మక్తల్‌కు చెందిన బీజేపీ రాష్ట్ర నాయకులు కొండయ్య నామినేషన్ వేశారు. ఈ మేరకు జిల్లా పార్టీ కార్యాలయంలో ఎన్నికల అధికారి గా వ్యవహరిస్తున్న కట్టా సుధాకర్‌కు నామినేషన్ పత్రాలను అందజేశారు. బీజేపీ నారాయణపేట జిల్లా అధ్యక్ష పదవి ఎన్నికకు ఊట్కూరు గ్రామానికి చెందిన ఎం భాస్కర్ బీజేపీ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. ప్రస్తుతం జిల్లా ప్రధాన కార్యదర్శిగా పదవీ బాధ్యతలు నిర్వహిస్తున్నా రు.

ప్రభుత్వం మాలల సమస్యలు పరిష్కరించాలి

ఊట్కూరు: రాష్ట్ర ప్రభుత్వం మాలల సమస్యలను పరిష్కరించాలని సోమవారం జాతీయ మాలల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు జాంగ్ హనుమంతు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం నాయకులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న వర్గీకరణ విషయంలో మాలలకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. 2011 సెన్సెస్ ప్రకారం కాకుండా ప్రస్తుత జనాభా ప్రతిపాదించిన మాలల జనాభాను లెక్కించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు హనుమంతు, మండల అధ్యక్షుడు మాల కృష్ణయ్య, హనుమంతు, రాములు, బాలచందర్, బాలరాజు, శారద, పద్మమ్మ పాల్గొన్నారు.

భూ సర్వే బలవంతంగా చేయొద్దు

మక్తల్: మక్తల్–నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల పథకం పనులకు భూ సర్వే పనులను బలవంతంగా చేయొద్దని, రైతులను ఇబ్బంది పెట్టకుండా వారికి న్యాయం చేయాలని మక్తల్ మార్కెట్ మాజీ చైర్మన్ నర్సింహగౌడ్ అన్నారు. మంగళవారం మక్తల్‌లో మాజీ ఎమ్మెల్యే చిట్టెం రాంమోహన్‌రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు సమాచారం లేకుండా వారి పొలాల్లో సర్వే చేయడం వల్ల ఆందోళన చెందుతున్నారన్నారు. అధికారులు గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించి వారికి నోటీసులు ఇవ్వాలన్నారు. మండంలోని కాట్రేవ్‌పల్లి, టేకులపల్లి, యర్నాగన్‌పల్లి, కాచ్‌వార్ గ్రామాలకు రైతులు వందలాది మంది తమ భూములను ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్నారన్నారు. మహిపాల్‌రెడ్డి, జుట్ల శంకర్, రామకృష్ణారెడ్డి, నర్సింహు లు, విష్ణువర్ధన్‌రెడ్డి, కుర్వ మల్లేష్, అన్వర్, మొగులప్ప, అశోక్‌కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మాసన్న గంధోత్సవం

చిన్నచింతకుంట: కొకుంట్ల మండలం అప్పంపల్లిలో అబ్దుల్ రహమాన్(మాసన్న) మంగళవారం గంధోత్సవం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. రాత్రి గ్రామంలోని దర్గా నిర్వాహకుల ఇంటి దగ్గరనుంచి మేళా తాళాల మధ్య గంధంను ఊరేగింపుగా దర్గాకు తీసుకువచ్చారు. అనంతరం ఖవాలీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

ముందస్తు చర్యలు తీసుకోవాలి

- తాగునీటిపై సమీక్ష సమావేశంలో కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట: వేసవి కాలంలో జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. మంగళవారం జిల్లా కేంద్రానికి సమీపంలోని సింగారం చౌరస్తా వద్ద వృత్తి నైపుణ్య అభివృద్ధి కేంద్రంలో తాగునీరు–స్వచ్ఛభారత్, మిషన్ ఉపాధి హామీ కూలీలు, యాక్షన్ ప్లాన్ 2025 జల శక్తి అభియాన్, వనమహోత్సవ కార్యక్రమాలపై ఎంపీడీఓ ఎంపీఓ ఉపాధి హామీ అధికారులతో సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. గ్రామాల్లో ఉపాధి హామీ పనులు కల్పించి కూలీలకు వేసవిలో అండగా నిలవాలన్నారు. ఉపాధి హామీ పనుల యాక్షన్ ప్లాన్ తయారు చేయాలన్నారు. జిల్లాలో లేబర్ మొబిలైజేషన్‌ను ఇంప్రూవ్ చేయాలన్నారు. నర్సరీల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించి ఆయా గ్రామాల్లో నర్సరీల ఏర్పాట్లు చర్యలు తీసుకోవాలన్నారు. 11ఏళ్ల పాటు నర్సరీల నిర్వహణ జరుగుతున్నా, చాలాచోట్ల ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కలెక్టర్ ప్రశ్నించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని తాగునీటి ఎద్దడి లేకుండా అన్ని గ్రామాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరా సక్రమంగా జరగాలన్నారు. ప్రతి గ్రామంలో క్లోరినేషన్ చేయాలని, వాటర్ ట్యాంకులను శుభ్రం చేయాలని, బ్లీచింగ్ పౌడర్ అందుబాటులో ఉంచాలన్నారు. మోటార్లకు మరమ్మతు చేయించి నీటి సరఫరాకు ఆటంకం లేకుండా చూసుకోవాలన్నారు. ఎక్కడైనా లీకేజీలు ఉంటే మరమ్మతులు చేయించాలన్నారు. సమావేశంలో డీఆర్డీఓ మొగులప్ప, డీపీఓ కృష్ణ, మిషన్ భగీరథ ఈఈ వెంకట్‌రెడ్డి ఉన్నారు.

వలసల తగ్గింపు కోసం కృషి చేద్దాం

జిల్లాలో వలసల తగ్గింపు, బాధిత వలసదారులకు మద్దతు అందించేందుకు మైగ్రేషన్ మల్టీ పార్ట్‌నర్ ట్రస్ట్ ఫండ్ సహాయంతో చేపట్టబోయే కార్యక్రమాలకు సహకరించి వలసల తగ్గింపు కోసం కృషి చేద్దామని కలెక్టర్ సిక్తాపట్నాయక్ అన్నారు. కలెక్టర్ అధ్యక్షతన ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్, ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ మైగ్రేషన్ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ ప్రాజెక్ట్ కింద జిల్లాలోని కోస్గి మండలం చంద్రవంచ, ముశ్రిఫా గ్రామాలు, గుండుమల్ మండలంలోని ముదిరెడ్డిపల్లి, అప్పాయిపల్లి గ్రామాలు ఎంపిక చేశారు. ఆ సంస్థలు నిర్వహించిన ప్రాథమిక సర్వే ఆధారంగా అధిక సంఖ్యలో వలసదారులు ఉన్నట్లు గుర్తించారు. ముఖ్యంగా మహిళల పై ఆధారపడిన కుటుంబాలను ప్రోత్సహించేందుకు, వలస వెళ్లి తిరిగి వచ్చిన వలసదారులకు జీవనోపాధిగా మేకల యూనిట్లు పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఈ ప్రాజెక్ట్ అమలులో వ్యవసాయం, పశువైద్యం, కార్మిక శాఖ, మహిళా, శిశు సంక్షేమ శాఖ వంటి విభాగాల నుంచి అవసరమైన సూచనలు తీసుకున్నారు. సమావేశంలో ఎఫ్ఏఓ నుంచి శాలిని, ఐఓఎం నుంచి అమిత్, డీఏఓ జాన్ సుధాకర్, పశువైద్య అధికారులు, కోస్గి, గుండుమల్ మండల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న అధికారులు

విద్యార్థులకు అవగాహన సదస్సు



విద్యార్థులకు సూచనలిస్తున్న ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ లక్ష్మణ్

నారాయణపేట: జిల్లా కేంద్రంలోని ఎస్ఆర్ గార్డెన్ ఫంక్షన్ హాల్లో మంగళవారం వారియర్స్ డిఫెన్స్ అకాడమీ, లయన్స్‌క్లబ్ నారాయణపేట ఆధ్వర్యంలో 10వ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు కేంద్ర, రాష్ట్ర రక్షణ రంగ ఉద్యోగాలపై వారియర్స్ డిఫెన్స్ అకాడమీ డైరెక్టర్ ఆంజనేయులు ఆర్మీ అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ లక్ష్మణ్ హాజరై విద్యార్థులకు గోల్ సెట్టింగ్, సక్సెస్ టిప్స్, టైం మేనేజ్మెంట్ అంశాలపై దిశ నిర్దేశం చేశారు. సమాజంలో ప్రాణం ఉన్న జీవులతో పోలిస్తే కేవలం మనిషికే విలువ ఉందన్నారు. జ్ఞానం ఉంటేనే మనిషికి కావాల్సిన వనరులు దగ్గరికి వస్తాయన్నారు. వారియర్స్ డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. అనంతరం కెరీర్ గైడెన్స్‌పై కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో టూరిజం శాఖ డైరెక్టర్ కాట్రగడ్డ విజయకుమార్, లయన్ హరినారాయణ బట్టడ్, రవి కుమార్‌గౌడ్, లయన్స్ క్లబ్ నారాయణపేట అధ్యక్షులు జి రాఘవేందర్‌రెడ్డి, మోహన్, సాయినాథ్, బాలు, మురళీధర్, శేషమ్మ, ఆదర్శ యూత్ ప్రెసిడెంట్ రాజు, ఆర్మీ జవాన్లు, ఆయా పాఠశాలల, కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్ పత్రాల దహనం

నారాయణపేట: 2025–26 కేంద్ర ప్రభుత్వం నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక మని, కార్పొరేట్ శక్తులకు మేలు కలిగించేలా బడ్జెట్ ఉందని సీపీఎం రాష్ట్ర నాయకులు ఆర్ వెంకట్రాములు విమర్శించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో కేంద్ర నమూనా బడ్జెట్ పత్రాలను వామపక్షాల ఆధ్వర్యంలో దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతు బడ్జెట్ అంటూనే రైతు రుణమాఫీకి తగిన బడ్జెట్ కేటాయించలేదని, విద్యుత్ సంస్కరణలతో వ్యవసాయరంగం, పారిశ్రామిక రంగం కుదేలు అవుతాయన్నారు. బీమా రంగంలో 74 శాతం ఉన్న ఎఫ్డీఐ ని 100 శాతానికి పెంచడం ఎల్ఐసీని పూర్తిగా ధ్వంసం చేయడమేనని ఆందోళన వ్యక్తం చేశారు. ఖనిజ సంపద ప్రైవేట్ కంపెనీలకు అప్పజెప్పడం తదితర నిర్ణయాలతో బడ్జెట్ కూడుకొని ఉందని, అందువల్ల ఈ నమూనా బడ్జెట్ పత్రాలను దహనం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి జీ వెంకట్రామారెడ్డి, గోపాల్, మహేష్ కుమార్, కాశప్ప, శ్రీనివాస్, సీపీఐఎంఎల్ మాస్‌లైన్ నాయకులు నర్సింహ, ప్రశాంత్, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.



కేంద్ర బడ్జెట్ పత్రాలను దహనం చేస్తున్న వామపక్ష నాయకులు

ఘనంగా ఎల్లమ్మ ఉత్సవాలు



ఎల్లమ్మతల్లికి బోనాలు తీసుకెళ్తున్న భక్తులు

నారాయణపేట రూరల్: గ్రామీణ ప్రజల ఆరాధ్య దైవం ఎల్లమ్మతల్లి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. జిల్లాలోనే అత్యంత ప్రత్యేక కల్గిన లింగంపల్లిలో రెండో మంగళవారం భక్తులతో జనసంద్రంగా మారింది. అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాలు, కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి తరలివచ్చారు. ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మేళతాళాలు, కుర్వడోళ్లతో పురవీధుల్లో శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షుడు బాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ భాస్కర్, మాజీ జెడ్పీటీసీ అరవింద్‌కుమార్, మాజీ ఎంపీపీ ఎల్కోటి లక్ష్మీనారాయణరెడ్డి, జాతర కమిటీ అధ్యక్షులు హనుమంతు, ప్రధాన కార్యదర్శి ఆనంద్‌కుమార్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, యజ్ఞేశ్వర్‌రెడ్డి, ఎల్కోటి జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా ఊరలక్ష్మమ్మ జాతర

ఊట్కూరు: మండల కేంద్రంలో మంగళవారం ఘనంగా ఊరలక్ష్మమ్మ జాతర నిర్వహించారు. మహిళలు బోనాలతో ఊరేగుతూ గ్రామ శివారులోని ఊరలక్ష్మమ్మ దేవాలయానికి చేరుకొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి మేకలు, కోడిపుంజులతో నైవైద్యం సమర్పించారు.

కంచుకోట కాలనీలో..

ధన్వాడ: మండల కేంద్రంలోని కంచుకోట కాలనీలో జములమ్మ దేవాలయం వద్ద భక్తులు ఉత్సవాలు నిర్వహించారు. లింగంపల్లి ఎలమ్మ ఉత్సవాల సందర్భంగా జములమ్మకు పూజలు నిర్వహించారు. ఎల్లమ్మకు పూజలు చేసేముందు జములమ్మకు నైవేద్యం పెట్టి మొక్కులు తీర్చుకుంటారు. భక్తులు అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు.



ఊట్కూరులో పెద్దబోనంతో శోభాయాత్ర



బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

నేడు కాన్‌కుర్తికి ఎంపీ డీకే అరుణ రాక

దామరగిద్ద: మండలంలోని కాన్‌కుర్తి గ్రామంలో శివాజీ యువసేన ఆధ్వర్యంలో చేపట్టిన విగ్రహావిష్కరణకు ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే పర్ణికారెడ్డి హాజరుకానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విగ్రహావిష్కరణ కార్యక్రమానికి మండలంలోని వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు శివాజీ యూత్ నాయకులు, యువకులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

విగ్రహ ప్రతిష్ఠాపన పోస్టర్ల ఆవిష్కరణ



మరికల్: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో నిర్మించిన నూతన మైసమ్మతల్లి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనకు సంబంధించిన పోస్టర్లను మంగళవారం ఆలయ కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఈ నెల 22నుంచి 24 వరకు మైసమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు తరలివచ్చి జయప్రదం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రామస్వామి, శివ, తిర్మలయ్య, రాజు, నర్సింహులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు వేతనాలు అందించాలి



కోస్గి: మున్సిపాలిటీల్లో పని చేస్తున్న కార్మికులకు వేతనాలు సక్రమంగా ఇవ్వకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం విధిగా ప్రతి నెల 5వ తేదీలోగా కార్మికులకు వేతనాలు అందించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాల్‌రామ్ డిమాండ్ చేశారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయం ముందు మధ్యాహ్న భోజన సమయంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఇప్పటికే కనీస వేతనాలకు నోచుకోకుండా పని చేస్తున్న కార్మికులకు ఇచ్చే అరకొర వేతనాలు సైతం ప్రతి నెల చెల్లించకపోవడంతో వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారన్నారు. కార్యక్రమంలో తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు దశరథ్, అంజిలయ్య, శ్రీనివాసులు, వెంకటయ్యతోపాటు పలువురు కార్మికులు పాల్గొన్నారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు

కోస్గి: స్థానిక మున్సిఫ్ కోర్టు న్యాయవాదులు మంగళవారం విధులు బహిష్కరించి కోర్టు ముందు నిరసన తెలిపారు. అడ్వకేట్ సవరణ బిల్లు–2025కు వ్యతిరేకంగా జాతీయ స్థాయిలో బార్ అసోసియేషన్ పిలుపు మేరకు ఈ నిరసన తెలిపారు. న్యాయవాదుల గౌరవానికి పూర్తిగా విరుద్ధంగా, క్రూరంగా ఉన్న అడ్వకేట్ సవరణ బిల్లు–2025ను వెంటనే రద్దు చేయాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గందె ఓంప్రకాష్, ప్రధాన కార్యదర్శి శకనప్ప, న్యాయవాదులు ప్రభాకర్, కరుణాకర్ రెడ్డి, సంతోష్, రాజురెడ్డి, భీమేష్, పర్వీన్ బేగం, తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

మంచి స్నేహితులుంటే భవిష్యత్ మనదే

మరికల్: కళాశాల్లో చదివే విద్యార్థులకు మంచి స్నేహితులుంటే మంచి భవిష్యత్‌కు పునాది అవుతుందని ఎస్ఐ రాము అన్నారు. మరికల్‌లో మంగళవారం మణికంఠ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్ పూర్తి చేసుకున్న తర్వాత మీరు ఎంపిక చేసుకున్నే కోర్సులో రాణించాలంటే పట్టుదల, ఏకగ్రత ఎంతో అవసరమన్నారు. తల్లిదండ్రుల కష్టానికి, అధ్యాపకుల కృషికి తగ్గట్టుగా విద్యార్థులు ఫలితాలు సాధిస్తేనే గుర్తింపు వస్తుందన్నారు. ముఖ్యంగా సమాజంలో చేడు స్నేహితుల పక్కన తిరిగితే జీవితం అంధకారమవుతుందన్నారు. అనంతరం విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కరస్పాండెంట్ చంద్రకాంత్‌గౌడ్, ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రావు, యువక మండలి అధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఐ రాము

శ్రీశైలానికి మాలధారుల పాదయాత్ర



నిడ్జింత నుంచి పాదయాత్రగా బయలుదేరి వెళ్తున్న మాలధారులు

మద్దూరు/కొత్తపల్లి/నర్వ: మండల కాలంపాటు శివదీక్ష చేపట్టిన మాలధారులు మంగళవారం స్థానిక దేవాలయాల్లో గురుస్వాములు, పూజారుల సమక్షంలో ఇరుముడులతో పాదయాత్రగా శ్రీశైలానికి బయలుదేరి వెళ్లారు. మద్దూరు పట్టణంలోని కాచువాగు శివాలయంలో 30 మంది మాలధారులు పూజారి రాకేష్ దగ్గర ఇరుముడులు కట్టుకున్నారు. అనంతరం శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పాదయాత్ర బయలుదేరారు. కొత్తపల్లి మండలంలోని నిడ్జింతలోని శివాలయంలో గురుస్వాములు ఆధ్వర్యంలో 30 మంది మాలధారులు ఇరుముడులు కట్టుకొని శ్రీశైలానికి బయలుదేరారు. ఈ సందర్భంగా రెండు గ్రామాల్లోని శివాలయాల్లో పండుగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో నగేష్, మొగులప్ప, శ్రీను, నర్సింహులు, తదితరులు పాల్గొన్నారు.

- నర్వ మండలంలోని జక్కన్నపల్లి, లంకాల్ గ్రామాల శివమాలధారులు శ్రీశైలానికి పాదయాత్రగా బయలుదేరారు. ఈ సందర్భంగా శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇరుముడితో మాలధారులు పాదయాత్రగా బయలుదేరారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



నారాయణపేట ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ అభ్యసన పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం, వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ అనంతరం ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ బాగా చదివి భవిష్యత్‌లో ఉన్నత స్థానానికి ఎదగాలన్నారు. మార్చిలో జరిగే పదో తరగతి పరీక్షల్లో అందరూ ఉత్తీర్ణత సాధించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుల బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

పేట విద్యార్థులకు సీవీ రామన్ అవార్డులు

నారాయణపేట రూరల్: జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు సీవీ రామన్ ప్రతిభ పరీక్షల్లో చక్కటి ప్రతిభ చాటారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో పదో తరగతి విభాగంలో మల్లు అర్జున్ జిల్లా ద్వితీయ స్థానం, ఎనిమిదవ తరగతి విభాగంలో మేఘన జిల్లా ప్రథమ స్థానం, ఆరవ తరగతి విభాగంలో శ్రీజ జిల్లా ద్వితీయ స్థానం సాధించారు. హైదరాబాద్ లోని లలిత కళా తోరణంలో సూచిరిండియా ఫౌండేషన్ వారు సినీ నటుడు రావు రమేష్, సంస్థ సీఈఓ డాక్టర్ కిరణ్ చేతుల మీదుగా సీవీ రామన్ యంగ్ జీనియస్ అవార్డులను అందచేశారు.

సాయిలీలకు గురుబ్రహ్మ అవార్డు

సూచిరిండియా ఫౌండేషన్ వారు ఏటా ఇస్తున్న గురుబ్రహ్మ అవార్డులో భాగంగా ఈ విద్యా సంవత్సరానికి జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ పాఠశాల కరస్పాండెంట్ సాయిలీలను ఎంపిక చేశారు. ఈ మేరకు మంగళవారం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా హైదరాబాద్ లలిత కళా తోరణంలో అవార్డు అందజేశారు. వారందరిని పాఠశాల నిర్వాహకులు శేషమ్మ, మురళీధర్, కవిత,గోపాల్ రెడ్డి, సురేంద్రనాథ్, పాఠశాల ప్రిన్సిపాల్ బాలప్ప, అమీనా, నర్సింహ, సురేందరగౌడ్ అభినందించారు.



గురుబ్రహ్మ అవార్డు అందుకుంటున్న సాయిలీల

రామకృష్ణ పరమహంసకు నివాళి



ఆత్మకూర్: రామకృష్ణ పరమహంస జయంతిని పురస్కరించుకొని స్వామి వివేకానంద సేవాసమితి ఆధ్వర్యంలో మంగళవారం వివేకానంద విగ్రహం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్డు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ రాజేష్, దివాన్జీ ప్రభాకర్‌రావు, తాల్లపల్లి నాగరాజు, వెంకటనర్సింహారావు, మణివర్ధన్‌రెడ్డి, నాగేశ్వర్, నర్సింహ, బాలకృష్ణ, బాలు, రాజేష్, సూరి, రాము ఉన్నారు.

కొనసాగిన అధికారుల తనిఖీ

నారాయణపేట రూరల్: టెన్త్ విద్యార్థుల ఇంటర్నల్ మార్కుల పరిశీలనకు సంబంధించి అధికారుల తనిఖీ మంగళవారం రెండోరోజూ కొనసాగింది. పట్టణం, మండలంలో మూడు బృందాలు వివిధ ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలలను సందర్శించి అక్కడ నిర్వహించిన ఫార్మెటివ్ పరీక్షలు, ప్రాజెక్టు ఇతర అంశాలకు సంబంధించి కేటాయించిన 120మార్కులను సరిచూశారు. జీహెచ్ఎంలు అనురాధ, సత్యనారాయణసింగ్, భారతిల నేతృత్వంలో ఒక్కో బృందంలో ఒక ల్యాంగ్వేజ్ టీచర్, మరో నాన్ ల్యాంగ్వేజ్ టీచర్లు సభ్యులుగా ఉండి మార్కుల పరిశీలన చేపట్టారు. ఆయా కార్యక్రమాల్లో భానుప్రకాష్, నారాయణరెడ్డి, రవికుమార్, మధుసూదన్ పాల్గొన్నారు.



జాజాపూర్ జెడ్పీ పాఠశాలలో మార్కులు పరిశీలిస్తున్న బృందం